# బాబోయ్.. బీఆర్టీఎస్

ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి నిర్మించిన 'శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ'(బీఆర్‌టీఎస్) లక్ష్యం నెరవేరడం లేదు. పైగా ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. కేవలం జేఎన్ఎన్‌ఆర్‌యూఎం బస్సుల కోసం నిర్మించిన మార్గంలో కూడా సాధారణ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మరో వైపు సబ్‌వే మార్గాలకు అనుసంధానంగా నిర్మించిన కారిడార్లు అసంపూర్తిగా వదిలేశారు. ఫలితంగా ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.


కంచరపాలెం రైతుబజారు వద్ద గ్రిల్ ఏర్పాటు చేయని ప్రాంతం


మర్రిపాలెంలో విరిగిన కారిడార్‌ను ఇలా వదిలేశారు

| ఏడాది | ప్రమాదాల సంఖ్య | గాయాలు | మరణాలు |
|---|---|---|---|
| 2022 | 18 | 16 | 04 |
| 2023 | 12 | 10 | 02 |
| 2024 | 21 | 19 | 02 |
| 2025 | 08 | 08 | 00 |



అసంపూర్తిగా రెయిలింగ్... అవస్థల్లో పాదచారులు

ప్రమాద భరితంగా రోడ్లు

అదుపు తప్పుతున్న ద్విచక్ర వాహనాలు

బీఆర్‌టీఎస్ రహదారిలో ప్రాణాలు పోతున్న వైనం


ఐటీఐ కూడలిలో అసంపూర్తిగా ..


ఊర్వశికూడలి వద్ద బారికేడ్ దాటుతున్న పాదచారులు

దుర్గానగర్ వద్ద రోడ్డు దాటుతున్న పాదాచారినిని ఢీ కొన్న బైక్

**కంచరపాలెం:** కంచరపాలెం కూడలి నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు, అటు జ్ఞానాపురం కాన్వెంటు కూడలి వరకు బీఆర్‌టీఎస్ రహదారిలో కారిడార్లు అసంపూర్తిగా నిర్మించారు. దీంతో ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పడంలేదు. నేతాజీ ఫ్లైఓవర్ కూడలి, కంచరపాలెం రైతుబజార్, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా ప్రాంతాల్లో సేఫ్టీగ్రిల్స్ దెబ్బతిన్నాయి. మరికొన్నిచోట్ల నేల కొరిగిపోవడంతో రోడు దాటే పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కారిడార్ల నుంచి బీఆర్‌టీఎస్ మార్గాన సబ్‌వేలోకి వెళ్లేటప్పుడు నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు బీఆర్‌టీఎస్ రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు కారిడార్లు దాటే పాదచారులు ఒక్కసారిగా రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.

**మూలకు చేరిన కారిడార్లు**

బీఆర్‌టీఎస్ రహదారుల్లో కారిడార్లు తుప్పుపట్టి మూలకుచేరాయి. జోన్–5 ఇంజినీరింగ్ విభాగ అధికారులు పర్యవేక్షణ గాలికి వదిలేశారు. కొన్ని ప్రాంతాల్లో నేలకు ఒరిగిన వాటిని స్క్రాప్ దుకాణాలకు చేరుస్తున్నారు. మిగిలిన కారిడార్లకు రంగులు వేస్తే కనీసం కొంత కాలం నిలుస్తాయని చెబుతున్నారు. లేని పక్షంలో ప్రమాదాలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కారిడార్లు ఏర్పాటు చేయాలి



బీఆర్‌టీఎస్ రహదారి కారిడార్లు లేక రోడ్లు దాటేటప్పుడు పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనదారులు అతివేగంతో బీఆర్‌టీఎస్ రహదారుల్లో ప్రయాణం చేస్తున్నారు. బస్సులు ప్రయాణించాల్సిన మార్గంలో దూసుకుపోతున్నారు.మరో వైపు ప్రధాన మార్గాల్లో కారిడార్లు లేకపోవడంతో ప్రజలు ఇష్టారాజ్యంగా రోడ్లు దాటుతున్నారు. ప్రమాదాలకు గురై క్షతగాత్రులవుతున్నారు. **–లక్ష్మి, పాదచారిణి**, ఐటీఐ జంక్షన్,

### భయం భయం



అసంపూర్తి పనులతో అవస్థలు పడుతున్నాం. ప్రధాన రహదారి దాటాలంటేఆందోళనగా ఉంటుంది. మా మేనకోడలు బీఆర్‌టీఎస్ రహదారిలో కారిడార్ నుంచి రోడ్డు దాటుతుండగా బైక్ నడిపే వ్యక్తి వాహనంతో ఢీ కొట్టడంతో కాలికి బలమైన గాయం అయింది. నిత్యం ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పెద్ద ప్రమాదాలు జరిగితే హడావుడి చేసే అధికారులు ఇప్పుడు కనిపించడంలేదు. అధికారులు స్పందించాలి. **–లలిత**, స్థానికురాలు, కంచరపాలెం.

### చర్యలు చేపడతాం

జోన్ పరిధిలోని బీఆర్‌టీఎస్ రహదారుల్లో పలు ప్రాంతాల్లో సమస్య ఉంది. కొంత మంది టీడీఆర్‌లు తీసుకోకుండా కోర్టుకు వెళ్లడంతో రోడ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రమాదాల కూడళ్లలో కారిడార్లు ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ విభాగాధికారులతో మాట్లాడి బీఆర్‌టీఎస్ రహదారుల్లో అవసరమైన చోట్ల కారిడార్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

**–బొడ్డేపల్లి రాము**, జోనల్ కమిషనర్, జోన్–5, జ్ఞానాపురం.

## క్లుప్తంగా

### సాయిమందిరంలో పూజలు


పూజలందుకున్న సాయినాథుడు

**మల్కాపురం:** జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా గల నార్త్ ఇండియన్ మహిళలు పాల్గొని బాబాకు క్షీరాభిషేకం,విభూదితో అభిషేకం చేశారు. అనంతరం బాబాను పట్టు వస్త్రాలు,ఆభరణాలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు.సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు.

### విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ


విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్న ఆకుల ఇందిర తదితరులు

**కంచరపాలెం:** స్థానిక కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట ఉన్నత పాఠశాలలో నాంది ఫౌండేషన్ పీవో సత్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అలాగే ఆర్‌పేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు చేతుల మీదుగా 94 మందికి స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. పాఠశాలలో బాలికల విద్యను ప్రోత్సహిస్తున్న నాంది ఫౌండేషన్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఎస్‌పీ ఆకుల ఇందిర, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్ పల్లవి, పాఠశాల పీఈటీ బాలరాజు, యోగా టీచర్ ఈతలపాక స్వాతి తదితరులు పాల్గొన్నారు.

### క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 102 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

**గోపాలపట్నం:** బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన 102 మందిని గురువారం కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు. అధిక జీతాల ఆఫర్‌తో ఎంపికకావడం గర్వకారణంగా ఉందని ప్రిన్సిపాల్ సకన్య అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారిగా భాగ్యలక్ష్మి


నియామక పత్రం అందుకుంటున్న భాగ్యలక్ష్మి

**మల్కాపురం:** ఎన్ఎస్ఎస్ విశాఖ జిల్లా నోడల్ అధికారిగా ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. ఈమేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. భాగ్యలక్ష్మి రెడ్ రిబ్బన్ క్లబ్ జిల్లా కో–ఆర్డినేటర్‌గా పని చేశారు.

### ప్రమాదకరంగా గొయ్యి


అధ్వానంగా నరసింహనగర్ రోడ్డు

**గోపాలపట్నం:** జీవీఎంసీ 92వ వార్డు నరసింహనగర్ వద్ద ప్రధాన రహదారిలో యూజీడీకి అనుసంధానం చేసేందుకు తవ్విన గోతిని పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. గతంలో ఇలాంటి గోతులను వాటర్ వర్క్స్ విభాగం పూడ్చేవారు. ఇపుడు వీటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డుకు కలిపే రహదారిలో పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. వీటికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

### క్రీడా సామగ్రి పంపిణీ


విద్యార్థినులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న నంది ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

**సింథియా:** జీవీఎంసీ 40వ వార్డు పరిధి గాంధీగ్రామం ప్రైమరీ, సెకండరీ ప్రభుత్వ పాఠశాలలో గురువారం నంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు క్రీడా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పర్యవేక్షణలో నాంది ఫౌండేషన్ సభ్యులు చేతులమీదుగా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ నన్హికలి ప్రాజెక్ట్ ద్వారా గత 60 ఏళ్లుగా ఆర్థికంగా వెనుకబడిన బాలికలను క్రీడల్లో ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్నారన్నారు. క్రీడలతో పాటు చదువుల్లోనూ ముందుండి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎన్జీవో ద్వారా పాఠశాలలో బాలికలకు క్రీడా కిట్లు, నోట్‌బుక్స్ అందజేశారు.

### పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత


శివాజీ పార్క్‌లో జ్యూట్ బ్యాగ్‌లు అందిస్తున్న సోమన్నారాయణ తదితరులు

**ఎంవీపీకాలనీ:** శివాజీ పార్క్‌లో గురువారం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతరించిపోతున్న పిచ్చుకలను సంరక్షించడం ప్రజలందరి బాధ్యతని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకల పాత్ర కీలకమన్నారు. పిచ్చుకల సంరక్షణ దిశగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచనలకు అనుగుణంగా జేడీ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అవగాహన సదస్సులు అభినందనీయమన్నారు. పిచ్చుకలతోపాటు మరిన్ని పక్షి జాతుల సంరక్షణకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శివాజీ పార్క్ సందర్శకులకు జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో నాగేశ్వరరావు, సంస్థ ఉత్తరాంధ్ర కన్వీనర్ అను, విశాఖ కన్వీనర్ సలాది కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చట్టాలపై అవగాహన అవశ్యం


సదస్సులో మాట్లాడుతున్న 8వ అదనపు జిల్లా జడ్జి కవిత

**పెదగంట్యాడ:** మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని 8వ అదనపు జిల్లా జడ్జి కవిత అన్నారు. గాజువాక మండల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలు, బాలికల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో మహిళలపై వేధింపులు, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పరిస్థితులు, సామాజిక సమస్యలు, అవగాహన లోపం వీటికి ప్రధాన కారణమన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేసేందుకు ప్రభుత్వాలు, కోర్టులు, పోలీసులు ముందుండాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం మాలతి, ఉపాధ్యాయుడు రాజారావు, సోషల్ వర్కర్ వినోద్ బాలు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్‌కు పలువురు ఏకగ్రీవంగా ఎన్నిక

- నామినేషన్ల ఉపసంహరణ పూర్తి

**గాజువాక:** గాజువాక బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా వివిధ స్థానాలకు పలువురు న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఆ వివరాలను ప్రకటించారు. ఉపాధ్యక్షురాలిగా కె.సత్యవాణి, గ్రంథాలయ కార్యదర్శిగా బి.వి.ఎం.కృష్ణ, మహిళా ప్రతినిధిగా సూర్యకళతోపాటు కార్యవర్గ సభ్యులుగా సీహెచ్.గంగాభవాని, ఎం.కనకమహాలక్ష్మి, ఎ.మురళీమోహన్, ఆర్.రేవతి, ఎం.విజయ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పేర్కొన్నారు. కాగా, బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి బి.వేదమణి, ఎం.వేణు, కార్యదర్శి స్థానానికి టి.ప్రసన్న కుమారి, డి.చిరంజీవి, సంయుక్త కార్యదర్శిగా ఇ.గిల్బర్ట్, జామి శ్యామలరావు, ఎల్.సత్యనారాయణ, పల్లా శ్రీనివాసరావు పోటీలో ఉన్నట్టు ఎన్నికల అధికారి తెలిపారు.

## సేవాతత్పరుడు శోభన్‌బాబు


శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అభిమానులు

**కంచరపాలెం:** స్థానిక రామ్మూర్తిపంతుల పేటలోని మహాత్మాగాంధీ గ్రంథాలయం వద్ద సిటీ వైడ్ శోభన్‌బాబు, కంచరపాలెం ఫ్యాన్స్‌అధ్యక్షుడు కొణతాల వెంకటరావు ఆధ్వర్యంలో గురువారం 'నటభూషణ్' శోభన్‌బాబు 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. సంఘసేవకు మారుపేరుగా శోభన్‌బాబు ఖ్యాతి గడించారని కొనియాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో మువ్వల పోలారావు, కె.వెంకటరావు, కొణతాల చిన్న, విజయకుమార్, మురళీరాజ్, ఎం. సూర్యనారాయణ, జి.ఫణిభూషణరావు, పి.పైడిరాజు, డీవీ రావు, కె.సూర్యరత్నం, పి.దేవకి, పల్లా ఈశ్వర రావు, నైదాన శంకరావు పాల్గొన్నారు.

## దాడి చేశారంటూ ఆందోళన


ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

**గోపాలపట్నం :** తమపై దాడి చేశారంటూ ఎయిర్‌పోర్టు పోలీసు స్టేషన్ వద్ద ఓ వర్గం ఆందోళన చేసింది. ఎయిర్‌పోర్టు పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏకలవ్య కాలనీలో నివాసముంటున్న ఆసనాల అప్పారావుపై ఒక వర్గం దాడికి పాల్పడింది. దీంతో ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. బాధితుడు మాట్లాడుతూ తన ఆటోను ఇద్దరు వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కక్షగట్టి తనపై, తన కుటుంబ సభ్యులపై కత్తులతో, కర్రలతో దాడి చేశారని ఆరోపించాడు. తలకు బలమైన గాయమైందని వాపోయాడు. ఈ గొడవలకు భూ వివాదాలే ప్రధాన కారణమని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశారు. ఎస్ఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు.

## సిరులతల్లికి పంచామృతాభిషేకం


కనకమహాలక్ష్మి అమ్మవారు

**డాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సునీతా విలియమ్స్‌కు మహిళల అభినందనలు


జాతీయ జెండాతో సునీతా విలియమ్స్‌కు అభినందనలు తెలుపుతున్న మహిళా వాకర్స్

**మురళీనగర్:** సుదీర్ఘకాలం తర్వాత అంతరిక్షం నుంచి భూమికి చేరుకున్న భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్‌కు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు జాతీయ జెండాతో స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన గురువారం కార్యవర్గ సమావేశం ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత సంతతి మహిళ 9 నెలల పాటు అంతరిక్షంలో గడిపి తన ధైర్యసాహసాలను ప్రకటించారన్నారు. సునీతా విలియమ్స్ లాంటి మహిళలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఈ నెలలో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. కోశాధికారి శేషామని జమా ఖర్చులను వివరించారు. మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా వేసవిలో ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు తవ్వించేలా మహిళలను చైతన్యపరచి, భూగర్భ జలాల పునరుద్ధరణకు కృషి చేయాలని మాధవి పిలుపునిచ్చారు. పూర్వ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి మాట్లాడుతూ వేసవిలో పక్షుల కోసం బాల్కనీలోని డాబాలపై చిన్న మట్టి తొట్టెల్లో నీటిని ఉంచాలన్నారు. మార్చి 31న ఐఏఎం సెమినార్ హాల్‌లో నిర్వహించనున్న జిల్లా 101 రెండో క్యాబినెట్ మీటింగ్‌కు క్యాబినెట్ సభ్యులు హాజరు కావాలని ఎడిటర్ శిరీష కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.కమల, కోశాధికారి శేషామణి, ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి , జాలీ వాకర్ సుగుణ కృష్ణవేణి, లీలా నాయుడు పాల్గొన్నారు.

## విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


నిరసన తెలుపుతున్న విద్యుత్ మీటర్ రీడర్లు

**డాబాగార్డెన్స్:** విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మీటర్ రీడర్స్ (ఏఐటీయూసీ అనుబంధం) అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన ధర్నానుద్దేశించి మాట్లాడారు. విద్యుత్ మీటర్ రీడర్లను ఏపీ విద్యుత్ డిస్కంలో పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించకపోగా, ఉన్న ఉద్యోగులను రోడ్డున పడేసి, సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలపై పెను భారం మోపుతూ, రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను అంధకారం చేయడానికి స్మార్ట్ మీటర్ల పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ ఉద్యోగులు నిరుద్యోగులు కావడమే కాక, వినియోగదారులందరిపై సింగిల్ ఫేస్ మీటర్‌కు 13,500, త్రీఫేస్ మీటర్‌కు 32,000 వాయిదా పద్ధతిలో వసూలు చేయడానికి నిర్ణయించారని తెలిపారు. ఒక వేళ మీటర్లు బర్న్ అయినా, లేక ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల వల్ల దెబ్బ తిన్నా, మరలా వినియోగదారుల వద్ద సింగిల్ ఫేస్ మీటరుకు రూ.6 వేలు, త్రీఫేస్ మీటర్‌కు రూ.13 వేలు వసూలు చేయడానికి నిర్ణయించారని తెలిపారు. అలాగే వైరింగ్‌లో లోపాలున్నా ఈ స్మార్ట్ మీటర్‌లో అధిక రీడింగ్ చూపిస్తున్నాయని, ఆ విధంగా ప్రజలు, వినియోగదారులను దోచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త మీటర్లు తీసుకొస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ రెహ్మాన్, విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి, విశాఖ జిల్లా కార్యదర్శి క్రాంతి, టి. గణేష్, ముత్యాలరావు, సురేష్, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**విశాఖ విద్య:** యువతరం పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆకాంక్షించారు. గురువారం తన కార్యాలయంలో హెచ్‌ఆర్‌ఎం విద్యార్థులను అభినందించారు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ లేబరేటరీ సంస్థలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి వారితో మాట్లాడారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలని, యువత ఈ స్ఫూర్తిని తీసుకుని నూతన వ్యాపార అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు.

## టెన్త్ స్పాట్‌కు మినహాయింపు ఇవ్వాలి


డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

**విశాఖ విద్య:** ఏప్రిల్ 3 నుంచి జరగబోయే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌కు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు గురువారం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పాట్ వాల్యుయేషన్‌లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి, ఫిజికల్లీ, విజువల్లీ చాలెంజ్డ్, 58 ఏళ్లు నిండిన వారు, ఎంఆర్ పిల్లలున్న వారికి, లాక్టేటెడ్ మదర్స్‌కు వ్యక్తిగత లెటర్లు తీసుకొని ముందుగానే వారి కోరిక మేరకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చినట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు. జిల్లా కోశాధికారి కె రాంబాబు, కార్యదర్శి టి.జగన్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై వినతి

**మద్దిలపాలెం:** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.వి.శివారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ విద్యాసాగర్‌లతో కలిసి గురువారం వినతిపత్రం అందించామని ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై సీఎస్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. సీఎస్‌ను కలిసిన వారిలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎ.రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలకవర్గ సభ్యులు అనంతరాములున్నారు.